
# ప్రముఖ విప్లవకవి చెరబండరాజు అస్తమయం




ప్రముఖ విప్లవకవి చెరబండరాజు రెండవ తేదీ తెల్లవారుఝామున హైదరాబాదులో మరణించారు. మెదడుకు సంబంధించిన కాన్సర్ (ట్యూమర్)తో ఆయన గత ఆయిదారు సంవత్సరాలుగా



బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు.

ఎమర్జెన్సీ కాలంలో జైలు శిక్షలకు, నిర్బంధనలకు చెరబండరాజు గురయ్యారు. ఆయన వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. అంకుశాపురమనేచోట జన్మించారు.

1967లో దిగంబర కవితా ఉద్యమం ప్రారంభమైనపుడు వారిలో ఒకరుగా కవిత్వాలు వ్రాశారు. సికిందరాబాద్ కుట్ర కేసులో ఆయనను ఇరికించారు. తరువాత ఆయన ఆరోగ్యస్థితినిబట్టి ఆ కేసునుంచి ఆయనను విముక్తం చేశారు. దిక్సూచి, వందేమాతరం, కాంతియుద్ధం, గౌరమ్మ కలలు, ముట్టడి, గమ్యం కవితా సంకలనాలు, ప్రస్థానం, మా వల్లె, నవలలు ప్రచురితమయ్యాయి.

1971లో విరసంలోచేరాక కొంతకాలం ప్రధాన కార్యదర్శిగాకూడా పనిచేశారు. చెరబండరాజు మృతి సాహిత్య ప్రపంచానికే కాక విప్లవాభిమానులకు, జనానికి తీరనిలోటు. ఆయన జనంమనిషి. అందరి హృదయాల్లోనూ జనం మనిషిగానే వుంటారు.

## మినీకథ

ఫోన్ గణగణా మ్రోగింది.

"హలో"

"హలో, ఎవరండీ!"

"నేను సుశీలను. కమలగారేకదూ!"

"నేనే! నమస్తే!"

"నమస్తే!"

"ఏమిటండీ విశేషం! ఈ వేళ యిలా హఠాత్తుగా ఫోన్ చేశారు"

"ఓ చిన్న పనుందండీ! మీరేమైనా బిజీగా వున్నారా!"

"అవునండీ! కొంచెం 'బిజీ' అనే చెప్పాలి. పనేమిటో చెప్పండి మీరు. నాకు చేతనైనదయితే తప్పకుండా చేస్తాను."

"ఆ మధ్య మీరు చేయించుకున్న కెంపుల నెక్లెస్ వుంది చూశారూ, వోసారి మోడల్ కావాలండీ!"

"అలాగే! దానికేం! అంతేనా యింకేమీ విశేషాలు లేవుగదా!"

"ఏం లేవుగానండీ మీరు ఈ రోజు క్లబ్‌లో ఫంక్షన్‌కు వెళ్ళడం లేదా?"

"వెళ్లాలనే అనుకుంటూన్నాను. ఏం అలా అడిగారు మీరు. వెళ్ళరా?"

"వెళ్దామనే అనుకుంటున్నాను ... మొన్న మీరు రాలేదేమండి!"

"అవునండీ! మా చిన్న బాబుకు మొన్న సుస్తీగా వుండే రావడం పడలేదు లెండి! - బాగా జరిగిందటగదా?"

"అహా! ఇప్పుడు మీ బాబుకు కులాసాగా వుందా?"

"ఆ! వుందండీ.... ఇక వుంటానండీ! ఫోన్ పెట్టేస్తున్నాను. ఆ ... అన్నట్లు పండక్కి మొన్న మీరు తీసిన చీరె ఏ షాపులోనండీ! చాలా బాగుంది. చాలా చక్కని సెలక్షన్ కూడాను."

"....షాపులోనే - అది మా పిన్ని కూతురు సెలక్షన్ లెండి. తనకంతా అలా మోడరన్‌గా వుండాలి. మీకూ నచ్చిందన్నమాట"

"బ్రహ్మాండంగా వుంది. ఆ కలర్ కూడా మీకు నప్పింది. నేను కంచి చీరె తీసినాకూడా మీ చీరె ముందు తీసికట్టే ననిపించింది."

(నవ్వి) "బలే చెప్తారు మీరు. ఆ! అవతల నాకు చాలా పనుంది. పెట్టేస్తున్నాను."

"మరండీ మీ ప్రక్క బిల్డింగులో పోర్షన్ ఒకటి ఖాళీగావుందని విన్నాను. ప్రస్తుతం యెవరైనా వచ్చేశారాండీ? మా వారి ఫ్రెండు వొకాయనకు ఈ వూరు ట్రాన్స్‌ఫర్ అయిందట. ఎక్కడైనా వుంటే చెప్పమన్నారుట."

# టెలి రాగింగ్

"నాకు సరిగ్గా తెలీదండీ! తెలుసుకున్న తరువాత మీకు ఫోన్ చేస్తాలెండి. అవునూ మీ బంధువుల అమ్మాయికి 'మ్యాచ్' వుంది, చూడాలన్నారు - సెటిలయిందా?"

"చూశారు కానీ యింకా సెటిల్ కాలే దండీ! అయినా ఈరోజుల్లో ఆడపిల్లల పెళ్ళిళ్ళు అంత త్వరగా కుదురుతున్నాయ టండీ! ఎంతెంత గడ్డు సమస్యగా వుంటోందో మనం చూడ్డంలేదూ? తంత్రి కాళ్ళచెప్పులు పాతవిపోయి కొత్తవి వస్తు



న్నాయిగాని వీళ్ళ పెళ్ళిళ్ళుమాత్రం కుదరడంలేదు. ఏవిటోనండీ ఒక్కొక్క ఆడపిల్ల విషయం చూస్తుంటే చాలా బాధగా వుంటోంది."

"మరేనండీ! మీకు మాత్రం ఆ బెంగ లేకుండా ఎంచక్కా యిద్దరూ మగపిల్లలే కదండీ! పెళ్ళి సంబంధాలు కట్నం బెడద లేదుకదా."

"ఆఁ ఏమోలెండి! ఆడపిల్లలకు పెళ్ళే పెద్ద సమస్య అయితే- మగపిల్లలకు అన్నీ సమస్యలే కదండీ! కాన్వెంటులో సీటు మొదలుకొని కాలేజీ సీట్లవరకు అన్నీ సమస్యలే, ఆపైన ఇక ఉద్యోగపర్వం ప్రారంభం! ఆ! ఏవిటో! ఏం బ్రతుకులో! ఏం జీవితాలో, అన్నీ యింతే.... ఆ యిక ఫోన్ పెట్టేస్తున్నాను. మరిచే పోయాను- మీ మరిదిగారికి యాక్సిడెంటు అయిందని విన్నాం- ఎలా వుందండీ? బాగా దెబ్బలు తగిలాయా?"

"లేదులెండి! కొద్దిగా చిన్న చిన్న గాయాలు మాత్రమే కానీ- ఈ రోజుల్లో ఇల్లు వదిలి బైటకు వెళ్ళిన మనిషి తిరిగి యెలా చేరతారో తెలీడంలేదు. చిన్న బ్యాండేజీతో బైటపడ్డం అదృష్టమే మరి!"

"నిజమేనండోయ్! మా తోటికోడలు అన్నగారి బావమరిది మేనల్లుడు పాపం పూర్తిగా అవిటివాడై పోయినాడు కదండీ ఇలాగే యాక్సిడెంట్‌లోనే!"

"అరె! అలాగా!"

"మన క్లబ్బు మెంబరు సుహాసిని- వాళ్ళ తమ్ముడు కూడా అంతే కదండీ!"

"అన్నట్టు మీరు క్లబ్బు అంటే గుర్తు వచ్చింది. పంకజం గారింట్లో జరిగిన ఫంక్షన్‌కు మీరు వెళ్ళలేదట కదండీ?"

"మరేనండీ! ఆమెగారి కెంత టెక్కు? మన క్లబ్బుకు కలెక్టరుగారి భార్య వచ్చి నప్పుడు గ్రూప్ ఫోటోకు కలెక్టర్‌గారి సతీమణి ప్రక్కనున్న నన్ను ప్రక్కకు నెట్టేసి తాను నిలబడిందండీ! ఆ పోజూ తనూను....నాకు మహా చెడ్డ చిరాకు అలాటి వాళ్ళంటే!"

"అలాగే వుంటుంది లెండి! అప్పు డెపుడో గవర్నరుగారి సతీమణిగారితో బహుమతి ప్రదానం చేయించాం కదండీ! అమ్మగో అప్పుడు ఆ సుగుణమణి కూడా అంతే! మహా తనే చదువుకున్నదాన్నని మహా గర్వం! అచ్చంగా తనే మాట్లాడాలనీ ఏం తాపత్రయ పడిపోయింది లెండి! అసలు నన్ను ఒక్క మాట కూడా మాట్లాడనీయలేదు! ఒళ్ళు మండిందంటే నమ్మండి! కత్తిగాటు మీద నిమ్మరసం పిండినట్లే సుమండీ!"

"కాదుటండీ! ఆ బాధ అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది. ఆ! చాలా టైమయి పోయిందండీ! ఇంట్లో చాలా పనివుంది కూడాను. ఫోన్ పెట్టేస్తున్నాను."

"నాకూడా పనుందండీ! ఇహ స్వీట్సు కూడా తయారు చెయ్యాలి. బంధువులు వస్తారివాళ!"

"ఆ! స్వీట్సు అంటే గుర్తుకొచ్చింది. మొన్న సంక్రాంతికి మీరేం స్వీట్సు చేశారు? నేనుమాత్రం రేడియోలో చెప్పారే 'చేసి చూడండి' అంటూను, ఆ కేక్సు! 3 రకాలు తయారుచేశాను! చాలా బాగా వచ్చాయి. కాకపోతే పంచదార కరువుగా వున్న ఈ రోజుల్లో యిలా యిన్ని స్వీట్సు అంటూ మావారు చీవాట్లేశారనుకోండి."

"అవునండోయ్! కాఫీలకే పంచదార బోలెడు ఖర్చయిపోతోంది. యింకా పండగ స్వీట్సు అంటూ చేయడం.... కష్టంగానే వుంది సుమండీ! ఏదో మామూలుగా చేసే పాయసాలతోనే సరి పుచ్చుకోవాల్సొస్తోంది..... ఏం గవర్నమెంటో ఏమిటో! సరుకుల ధరలు రోజు రోజుకూ పైకి లేచిపోతున్నాయి. కిరోసిన్ లగాయతూ అన్నీ సమస్యలే!"

"మీరన్నట్లు ధరలు రోజు రోజుకూ నక్షత్రాలతో స్నేహం కలుపుకోడానికి వెళుతున్నాయా అనిపిస్తోంది. పోనీ వాటికి తగ్గట్టు ఆదాయం పెరగదాయె! ప్రభుత్వమో ప్రజలో ఎవరి లోపమైతేనేం గానీ అవస్థలు మాత్రం అందరూ అనుభవిస్తున్నారు."

"మరేనండీ! మళ్ళీ ఎలక్షన్లు త్వరలోనే జరుగుతాయట. మళ్ళీ ఏం కొత్తపార్టీలో ఏమో!"

"ఆ! ఏ పార్టీ అయితేనేంగానీ జీవన విధానంలో మాత్రం మార్పు జరిగి యింతకన్న మంచిరోజులు వస్తాయనుకోడం మాత్రం...."

"అలా నిరుత్సాహ పడకండి మరి! ఏమో ఆశే కదా మానవులకు వూపిరి! ధరలన్నీ తగ్గిపోయే రోజులు, సమస్యలు లేకుండా అన్నీ అందుబాటులో వుండే రోజులు వస్తాయేమో చెప్పలేం కదండీ!"

"ప్రతి ఎలక్షన్ల ముందూ అలాగే ఆశ పడుతుంటారు- ఓట్లు వేసి గెలిపిస్తారు! మళ్ళీ షరా మామూలే గదండీ!"

ఇటునుంచీ అటునుంచీ కూడా నవ్వులు ఒక్కసారే! ఏదో అర్జంటుగా మాట్లాడ వలసిన పనిమీద ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ ఎంగేజిలో వుండడంతో ఆయన గారు స్కూటర్ మీద రయ్యిన ఇంటికి వచ్చేసి భార్యామణిగారి ముచ్చట్లు విని చేతిలోని రిసీవర్ గభాల్న లాగేసి హుక్ మీద పెట్టేశారుగానీ.... లేకపోతే వారి మధ్య కబుర్లలో యింకా యింకా ఏమేం దొర్లిపోయేవో మరి అనూహ్యమే!

—బచ్చు దేవకీదేవి